సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 3 । నవంబర్ । 2023



పంచాయతీ టు అసెంబ్లీ

మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారం రాజకీయ కీర్తిని ఘడించింది. 10లో▸



'పాలమూరు' పయనమెటో

షాద్‌నగర్‌లో ఏళ్ల నుంచి పాలమూరు చారిటబుల్ ట్రస్టు పేరిట విష్ణువర్ధన్‌రెడ్డి సేవా కార్యక్రమాలు చేపడుతన్నారు. 10లో▸



ఉద్యమ 'కారు'లో..

షాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు దేశమల్ల ఆంజనేయులు, శేరి పెంటారెడ్డి తిరిగి గులాబీ గూటికి చేరారు. 10లో▸

న్యూస్‌రీల్

త్వరలో మరిన్ని చెక్‌పోస్టుల ఏర్పాటు

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



ఇబ్రహీంపట్నంలో చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

ఇబ్రహీంపట్నం రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాచకొండ పరిధిలో 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు రాచకొండ పరిధిలో జరిపిన తనిఖీల్లో దాదాపు రూ.40 కోట్ల వరకు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు .పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామన్నారు.అనంతరం దర్గా వద్ద ఉన్న చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ గోవింద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

యాచారం: నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధిని చూసే మారోమారు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యాచారం మండలంలోని తమ్మలోనిగూడ, ధర్మన్నగూడ గ్రామాల నుంచి 200 మందికి పైగా నాయకులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.2,500 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. అన్నిగ్రామాలకు సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లు వేశామన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్శభాషా, తమ్మలోనిగూడ సర్పంచ్ సంతోష, నాయకులు పాల్గొన్నారు.

మధుయాష్కీతో కోదండరాం భేటీ

సాక్షి, సిటీబ్యూరో: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌తో గురువారం తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గంలో మధుయాష్కీ గౌడ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని టీజేఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మధుయాష్కీ గెలుపు కోసం స్వచ్ఛందంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై ఇరువురు నాయకులు చర్చించారు.

సర్వం సిద్ధం

నేటి నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ



- కేంద్రాల వద్ద మూడంచెల భద్రత
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- 'సాక్షి'తో జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు సర్వం సిద్ధం చేశాం. రెవెన్యూ డివిజన్, తహసీల్దార్, జోనల్ కమిషనర్ కార్యాలయాల్లో రిటర్నింగ్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలవుతుంది. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తాం' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి చెప్పారు. గురువారం ఆమె ఎన్నికల ఏర్పాట్లపై 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. నామినేషన్ల స్వీకరణ అనంతరం 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్యను బట్టి ఓటింగ్ బ్యాలెట్‌లను ఏర్పాటు చేస్తాం. ఒక్కో బ్యాలెట్‌పై 15 మంది పేర్లు, గుర్తులు ఉంటాయి. అంతకు మించితే అదనంగా మరో బ్యాలెట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

ఎక్కడికక్కడే నామినేషన్ల స్వీకరణ..

ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 3,369 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. వీటిలో 1,206 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. వీటిపై గట్టి నిఘా పెడతాం. అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు ఆయా నియోజకవర్గాల పరిధిలోనే ఎన్నికల రిటర్నింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. నామినేషన్ వేసేందుకు అభ్యర్థి వెంట ర్యాలీగా వచ్చిన వారిని 100 మీటర్ల దూరంలోనే నిలిపివేయనున్నాం. .

పోస్టల్ బ్యాలెట్ ఇష్యూ అయితే ఇక అంతే..

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగులు, వృద్ధులు, అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఇష్యూ చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాల వారీగా ఎంతమందికి పోస్టల్ బ్యాలెట్ ఇష్యూ చేశామనే వివరాలు రిటర్నింగ్ ఆఫీసర్ల వద్ద ఉంటుంది. జారీచేసిన పోస్టల్ బ్యాలెట్లను ఓటింగ్‌కు రెండు, మూడు రోజుల ముందే వారినుంచి స్వీకరిస్తాం. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసినవారు ఆ తర్వాత నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటుహక్కుని వినియోగించుకునే అవకాశం ఉండదు. ఒకవేళ వారు తమ బ్యాలెట్‌ను వినియోగించుకోలేకపోతే వారు తమ ఓటు హక్కును కోల్పోయినట్లే భావించాల్సి వస్తుంది.

'సువిధ'లో అప్‌లోడ్ చేసుకోవచ్చు

నామినేషన్ వేసే అభ్యర్థుల కోసం ఈసారి ప్రత్యేకంగా 'సువిధ' యాప్ సిద్ధం చేశాం. అభ్యర్థులు తమ నామినేషన్ ముందే అప్‌లోడ్ చేసుకోవచ్చు. నామినేషన్ అఫిడవిట్‌లో తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడొచ్చు. అన్ని అంశాలను పూరించాల్సిందే. ఆర్‌ఓ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. మూడంచెల పోలీసు భద్రత, లోనికి మూడు వాహనాల కంటే ఎక్కువ అనుమతించం.

ప్రపోజర్స్ స్థానిక ఓటర్లై ఉండాలి..

అభ్యర్థి వెంట నలుగురిని మాత్రమే అనుమతిస్తాం. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు ప్రపోజల్స్ ఒకరు ఉంటే సరిపోతుంది. అదే స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ప్రపోజల్స్ ఉండాలి. పోటీలో ఉన్న అభ్యర్థి స్థానికేతరుడైనా పర్వాలేదు కానీ.. ప్రపోజల్స్ మాత్రం స్థానికంగా ఓటుహక్కును కలిగి ఉండాలి. ఒక్కో అభ్యర్థి నాలుగు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. వీరు ఒకేసారి అయినా చేయవచ్చు లేదా రోజుకొకటి చొప్పున చేయవచ్చు.

వెంటనే లెక్కింపు షురూ..

నామినేషన్ దాఖలు చేసిన వెంటనే ఫ్రీ స్క్రూట్నీ చేస్తాం. అన్ని వివరాలు నమోదు చేసేలా చూస్తాం. డిపాజిట్ చేయకపోతే నామినేషన్ రిజెక్ట్ చేస్తాం. విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆస్తులు, అప్పులు వంటి వివరాలు సమర్పించాలి. నేర చరిత్రను వివరించాల్సిందే. ఏ ఒక్క వివరం లేకపోయినా నామినేషన్ రిజెక్ట్ చేసే అవకాశం ఉంది. నామినేషన్ వేసిన రోజు నుంచే అభ్యర్థి ఖర్చులు లెక్కిస్తాం. అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలకు మించరాదు. నామినేషన్‌కు ముందే ప్రత్యేక ఎకౌంట్ ఏర్పాటు చేసి.. నగదు జమ, ఖర్చుల వివరాలు నమోదు చేయాలి. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన రేట్‌చార్ట్ ప్రకారం ఖర్చులు లెక్కిస్తుంది. అన్ని చెల్లింపులు ఎకౌంట్, చెక్కుల ద్వారానే జరపాలి.

రిటర్నింగ్ కార్యాలయాల పరిశీలన

మహేశ్వరం: మహేశ్వరం తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి సందర్శించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే అనుమతించాలని సూచించారు. ఆ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్, డీఏఓ జ్యోతి, తహసీల్దార్ మహమూద్ ఆలీ, ఉప తహసీల్దార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

144 సెక్షన్ అమల్లో ఉంటుంది..

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ భారతి హోళికేరి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రిటర్నింగ్ అధికారి కార్యాలయం చుట్టూ 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఆర్డీఓ అమరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అన్వర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని నామినేషన్ దాఖలు, కౌంటింగ్ కేంద్రాలు

నియోజకవర్గం	రిటర్నింగ్ ఆఫీసర్	నామినేషన్ స్వీకరణ కేంద్రం	కౌంటింగ్ సెంటర్
ఎల్బీనగర్	ఎస్.పంకజ	జీహెచ్‌ఎంసీ జోనల్ ఆఫీస్	సరూర్‌నగర్ స్టేడియం
శేర్‌లింగంపల్లి	జి.శ్రీనివాసరెడ్డి	జోనల్ కమిషనర్ ఆఫీస్	గచ్చిబౌలి స్టేడియం
మహేశ్వరం	ఎస్.సూరజ్‌కుమార్	మండల ఆఫీస్, మహేశ్వరం	సీవీఆర్, ఇబ్రహీంపట్నం
ఇబ్రహీంపట్నం	కె.అనంతరెడ్డి	ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఆఫీస్	సీవీఆర్, ఇబ్రహీంపట్నం
కల్వకుర్తి	ఎస్.శ్రీను	మండల ఆఫీసు, కల్వకుర్తి	సీవీఆర్, ఇబ్రహీంపట్నం
రాజేంద్రనగర్	ఈ.మల్లయ్య	రాజేంద్రనగర్ ఆర్డీఓ ఆఫీస్	లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాల
చేవెళ్ల	పి.సాయిరాం	ఆర్డీఓ ఆఫీస్, చేవెళ్ల	లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాల
షాద్‌నగర్	వెంకటమాధవరావు	ఆర్డీఓ ఆఫీస్, చేవెళ్ల	లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాల

పొడవని.. పొత్తు

- కాంగ్రెస్‌తో లెఫ్ట్ పార్టీల కటీఫ్
- ఇబ్రహీపట్నం బరిలో సీపీఎం
- సీపీఐ, సీపీఎం కలిసి పోటీచేసేనా!



ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీతో కమ్యూనిస్టులు కటీఫ్ అయ్యారు. నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉంటుందనుకుంటే ఆ పార్టీ ముఖ్య నేతలు పొత్తులేదని తేల్చడంతో కమ్యూనిస్టులు ఒంటరయ్యారు. మునుగోడు ఉపఎన్నికలో బీఆర్‌ఎస్ పార్టీతో కలిసిపోయిన సీపీఎం, సీపీఐ పార్టీలు ఇప్పుడు కాంగ్రెస్‌తో కూడా పొత్తు లేకపోవడంతో డైలమాలో పడ్డాయి. ఎవరి దారి వారిదే అన్నట్లుగా రాష్ట్ర వ్యాప్తంగా పోటీచేయడానికి పూనుకున్నారు. కమ్యూనిస్టు పార్టీలు కలిసి పనిచేయడానికి సిద్ధపడినట్లు సమాచారం. అయితే ఇబ్రహీంపట్నం బరిలో నిలవాలని మొదటి నుంచీ కమ్యూనిస్టు పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. ఇక్కడ ఆ పార్టీల చరిత్ర ఒకసారి చూస్తే..

మూడుసార్లు గెలుపు..

1989లో మొట్ట మొదటి సారిగా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఇబ్రహీంపట్నంలో సీపీఎం పార్టీ అభ్యర్థిగా కొండిగారి రాములు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 1994లో రెండవ సారి కూడా కొండిగారి రాములు గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో మరో సారి సీపీఎం పార్టీ అభ్యర్థి మస్కు నర్సింహ గెలుపొందారు.

పట్నం గడ్డపై సీపీఎం పోటీ..

ప్రస్తుతం జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం పార్టీ ఇబ్రహీంపట్నం గడ్డపై పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. గత ఎన్నికల్లో ఇదే నియోకజకవర్గంలో సీపీఎం అభ్యర్థిగా మాజీ జెడ్పీటీసీ పగడాల యాదయ్య పోటీచేసి 10వేల ఓట్లను రాబట్టగలిగారు. ప్రస్తుతం సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ బరిలో నిలవనున్నట్లు సమాచారం. ఆయనతో పాటు మరి కొందరు నేతలు జంగారెడ్డి, పగడాల యాదయ్య కూడా పోటీలో ఉన్నారు.

అప్పట్లో కొండా.. ఇప్పుడు యాదయ్య

- 1949 ఎన్నికల నుంచీ కీలకంగా షాబాద్ మండలం
- అభ్యర్థుల జయాపజయాల్లో ప్రధాన భూమిక

షాబాద్: షాబాద్ మండలం ప్రతి ఎన్నికల్లో కీలకంగా మారింది. నిజాం కాలంలో షాబాద్ తహసీల్ కార్యాలయంగా ఉండేది. 1949లో షాబాద్ నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కొండా వెంకటరంగారెడ్డి షాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఐదు సంవత్సరాల తర్వాత 1954లో మళ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కొండా వెంకట రంగారెడ్డి.. రామారావు చేతిలో ఓటమి చవిచూశారు. 1962లో చేవెళ్ల నియోజకవర్గంగా ఏర్పడి షాబాద్ మండలం కూడా చేవెళ్ల నియోజకవర్గంలో ఉండేది. 1972లో షాబాద్ మండలాన్ని చేవెళ్ల నియోజకవర్గం నుంచి పరిగి నియోజకవర్గంలో కలిపారు. పరిగిలో ఒకసారి కమతం రాంరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. తర్వాత అహ్మద్ షరీఫ్ ఒకసారి, కొప్పుల హరీశ్వర్‌రెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో షాబాద్ మండలం మళ్లీ చేవెళ్ల నియోజకవర్గంలోకి మారింది. నాటి నుంచి నేటి వరకు షాబాద్ మండలంపైనే అభ్యర్థుల గెలుపు ఓటములు ఆధారపడ్డాయి. మారుమూల మండలమైనా ఏ అభ్యర్థి విజయంలోనైనా షాబాద్ మండలం కీలకంగా ఉంటోంది. ప్రస్తుతం చేవెళ్ల ఎమ్మెల్యేగా కాలె యాదయ్య (బీఆర్‌ఎస్) పనిచేస్తున్నారు.

నగరవాసికి జపాన్ జాబ్ వల!

- రూ.29.27 లక్షలు కొట్టేసిన కేటుగాళ్లు
- నకిలీ ఇంటర్వ్యూ, ఆఫర్ లెటర్‌లు
- వివిధ చార్జీల పేరిట డబ్బులు వసూలు
- సైబర్ క్రైమ్స్‌లో బాధితురాలి ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: జపాన్‌లో ఉద్యోగం ఉందంటూ నగరవాసిని నట్టేట ముంచారు సైబర్ నేరస్తులు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.29.27 లక్షలు కొట్టేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూసాపేటకు చెందిన యువతి గత జులైలో ఆన్‌లైన్‌లో ఉద్యోగం కోసం వెతకగా.. ఓ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సంస్థ నుంచి ఈ-మెయిల్ వచ్చింది. జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమోటివ్ ఉపకరణాల తయారీ సంస్థలో సీనియర్ అకౌంట్స్ మేనేజర్ ఉద్యోగం ఉందని మెయిల్ సారాంశం. ఆగస్టు నెలలో కంపెనీ ప్రతినిధిగా పరిచయం చేసుకున్న కోజిస్ నాకాకిత బాధితురాలిని ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేశాడు. ఆ మర్నాడు ఉదయం ఆమె మెయిల్‌కు కంపెనీ నుంచి జాబ్‌కు సెలెక్ట్ అయ్యావంటూ జీతభత్యాలు, బెనిఫిట్స్‌తో కూడిన ఆఫర్ లెటర్ వచ్చింది. అయితే డాక్యుమెంటేషన్, జీఎస్టీ ఇతరత్రా చార్జీల కోసం రూ.33,780 డిపాజిట్ చేయాలని ప్రతినిధులు సూచించడంతో.. నిజమేనని నమ్మిన ఆమె సొమ్మును బదిలీ చేసింది. ఆ తర్వాత కొద్ది సేపటికి పెట్టుబడుల మీద 40 శాతం బోనస్‌తో కలిపి వస్తాయని ఆశ చూపించడంతో రూ.29,27,780 పెట్టుబడులు పెట్టింది.

జీ-20 సదస్సుతో క్యాన్సిల్ అంటూ..

ఢిల్లీలో జపాన్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం ఉంటుందని బాధితురాలిని నమ్మించారు. రోజులు గడుస్తున్నా మీటింగ్ ఖరారు కాకపోవడంతో ఆరా తీయగా.. ఢిల్లీలో జీ-20 సమావేశాల నేపథ్యంలో మీటింగ్ వాయిదా పడిందని మాయమాటలు చెప్పారు. ఈసారి సమావేశం బెంగళూరులో అక్టోబర్ నెలలో ఉంటుందని చెప్పారు. ఈ సమావేశం కూడా జరగకపోవడంతో అనుమానం వచ్చిన బాధితురాలు బెంగళూరులోని జపాన్ ఎంబసీలో ఆరా తీయగా.. అసలు విషయం తెలిసి ఖంగుతింది. అసలు సదరు జపాన్ కంపెనీ ఎలాంటి రిక్రూట్‌మెంట్ డ్రైవ్ చేపట్టలేదని తెలిసింది. దీంతో సైబరాబాద్ సైబర్ క్రైమ్స్‌లో ఫిర్యాదు చేసింది.

కమలం రేసు గుర్రాలు

- మూడో జాబితాలో నలుగురి అభ్యర్థిత్వాలు ఖరారు
- ఎల్బీనగర్‌కు సామ, రాజేంద్రనగర్‌కు తోకల
- చేవెళ్లకు రత్నం, షాద్‌నగర్‌కు అందె బాబయ్య
- శేరిలింగంపల్లిపై కొనసాగుతున్న ఉత్కంఠ



అందెబాబయ్య (షాద్‌నగర్)



కేఎస్ రత్నం (చేవెళ్ల)



సామ రంగారెడ్డి (ఎల్‌బీనగర్)



తోకల శ్రీనివాస్‌రెడ్డి రాజేంద్రనగర్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎట్టకేలకు బీజేపీ అభ్యర్థుల మూడో జాబితా గురువారం విడుదలైంది. తొలి జాబితాలో జిల్లాలోని మహేశ్వరం, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం అభ్యర్థులను ఖరారు చేసిన అధిష్టానం తాజాగా విడుదల చేసిన మూడో జాబితాలో శేరిలింగంపల్లి మినహా మిగిలిన నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. వీటిలో ఎల్బీనగర్ నియోజకవర్గానికి బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామరంగారెడ్డి పేరును ఖరారు చేసింది. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి మైలార్‌దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి పేరును ఖరారు చేసింది. షాద్‌నగర్ నియోజవర్గానికి సీనియర్ నేత అందె బాబయ్యకు మళ్లీ అవకాశం కల్పించింది. ఇక చేవెళ్ల నియోజకవర్గం నుంచి ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే కేఎస్‌రత్నం పేరును ఖరారు చేసింది. జనసేనతో పొత్తు నేపథ్యంలో శేర్‌లింగంపల్లి టికెట్‌ను పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. అయితే సంస్థాగతంగా పార్టీకి గట్టి పట్టు ఉండటం, ఈ స్థానం అభ్యర్థి పేరును ఖరారు చేయకుండా నాన్చుతుండటంపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ టికెట్‌ను జనసేనకు కేటాయిస్తే.. పార్టీకి రాజీనామా చేయడానికి కూడా వెనుకాడబోనని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అధిష్టానానికి అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. అభ్యర్థుల వివరాలు..

నియోజకవర్గం: షాద్‌నగర్
అభ్యర్థిపేరు: అందెబాబయ్య
స్వస్థలం: ఏబీ కాలనీ, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా
పుట్టిన తేదీ: 05-08-1959 (64 సంవత్సరాలు)
విద్యార్హత: ఇంటర్
తల్లిదండ్రులు: అందె బాలమ్మ, అందె బాలయ్య
భార్య: అందె కిష్టమ్మ
సంతానం: అందె రాజేశ్వర్, అందె రాఘవేందర్, అందె నర్సింహులు
సామాజిక వర్గం: బీసీ (ముదిరాజ్)
రాజకీయ నేపథ్యం: 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి ఫరూఖ్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 1995 నుంచి 2000 వరకు ఫరూఖ్‌నగర్ మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగారు. అనంతరం రెండుసార్లు తెలుగు రైతు అధ్యక్షుడిగా పనిచేశారు. 2001 నుంచి 2005 వరకు ఫరూఖ్‌నగర్ ఎంపీటీసీగా, 2001 నుంచి 2005 వరకు ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో టీఆర్‌ఎస్‌లో చేరిక. 2017 నుంచి 2021 వరకు బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 2021 మేలో బీజేపీలో చేరిక. అప్పటి నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. తాజాగా బీజే పీ షాద్‌నగర్ ఎ మ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు.

నియోజకవర్గం: రాజేంద్రనగర్
అభ్యర్థిపేరు: తోకల శ్రీనివాస్‌రెడ్డి
భార్య: తోకల సింధురెడ్డి
కుమారుడు: త్రిశాంత్‌రెడ్డి
తల్లిదండ్రులు: తోకల శ్రీనివాస్ రెడ్డి, సంధ్యారెడ్డి
పుట్టిన తేదీ: 21-01-1991 (32 సంవత్సరాలు)
విద్యార్హత: ఏరోనాటికల్ ఇంజనీర్ (వాగ్ ఇన్‌స్టిట్యూట్, న్యూయార్క్)
రాజకీయ నేపథ్యం: 2015లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక. తెలంగాణ జాగృతి కన్వీనర్‌గా పనిచేశారు. 2016లో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి టీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేటర్‌గా పోటీచేసి విజయం సాధించారు. 2018లో సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2020లో బీజేపీలో చేరారు. జీహెచ్‌ఎంసీ మున్సిపల్ ఎన్నికల్లో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్‌గా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా (2023) బీజేపీ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు.

నియోజకవర్గం: చేవెళ్ల
అభ్యర్థి పేరు: కొరని సాయన్న రత్నం
స్వగ్రామం: కేతిరెడ్డిపల్లి, మొయినాబాద్, రంగారెడ్డి జిల్లా
తల్లిదండ్రులు: మైసమ్మ, కె.సాయన్న
భార్య: ఏమేలియా
సంతానం: ఇద్దరు కతూళ్లు, ఓ కుమారుడు
పుట్టిన తేదీ: 02-09-1958 (65 సంవత్సరాలు)
విద్యార్హత: బీఏ
సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)
రాజకీయ నేపథ్యం: 1983లో టీడీపీలో కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభం. ఆ పార్టీ అధికారప్రతినిధిగా, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పనిచేశారు. 1995-2000 వరకు రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, 2001లో టీఆర్‌ఎస్ పార్టీ ఫౌండర్ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2004లో నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీచేశారు. 2009లో టీడీపీ నుంచి చేవెళ్ల ఎమ్మెల్యేగా గెలిచి ఐదేళ్లు పనిచేశారు. 2014లో టీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 2018లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. అనంతరం మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. 2023 అక్టోబర్‌లో బీజేపీలో చేరారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా పోటీచేయనున్నారు.

నియోజకవర్గం: ఎల్బీనగర్
అభ్యర్థిపేరు: సామ రంగారెడ్డి
భార్య: సామ అలివేలు
కుమారులు: తిరుమల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి
విద్యార్హత: ఇంటర్మీడియట్
నివాసం: సాహెబ్‌నగర్, బీఎన్‌రెడ్డి, ఎల్‌బీనగర్
రాజకీయ నేపథ్యం: 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎల్‌బీనగర్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2018లో ఇబ్రహీంపట్నం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2019లో బీజేపీలో చేరారు. 2020 నుంచి బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తాజాగా (2023) ఎల్బీనగర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

మహేశ్వరం: మహేశ్వరంలో తానుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను భారీ మెజార్టీతో గెలిపిస్తాయని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నతూప్ర, మహేశ్వరం, గంగారం గ్రామాలకు చెందిన నాయకులు ఆమె సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. రూ.వందల కోట్ల నిధులను తీసుకొచ్చి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, జిల్లా రైతు కమిటీ సభ్యుడు యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, గంగారం సర్పంచ్ సాలీ వీరానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీర్వాదంతో గెలుస్తా..

మీర్‌పేట: నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులను చూసి మరోమారు ఆశీర్వదించాలని మంత్రి సబితారెడ్డి ప్రజలను కోరారు. మీర్‌పేట లెనిన్‌నగర్ కట్ట మైసమ్మ దేవాలయం వద్ద ప్రచార రథాలకు గురువారం మంత్రి పూజలు చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. గత సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా కట్టమైసమ్మ అమ్మవారికి పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టానని తెలిపారు. అమ్మవారు, ప్రజల ఆశీర్వాదంతో మహేశ్వరం నుంచి మూడవసారి విజయం సాధిస్తానని దీమా వ్యక్తం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి లెనిన్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు.మేయర్ దుర్గ, కార్పొరేటర్లు లావణ్య, బాలమణి, అరుణ, మమత, నాయకులు కామేష్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతే చెక్‌పోస్టుల పెంపు

రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్

మాడ్గుల: ప్రతీ ఒక్కరు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ రాజశేఖర్, సిబ్బందితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో 22 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని.. అవసరమైతే మరిన్ని పెంచుతామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో పీఎస్ పరిధిలోని ఏడుగురు రౌడీషీటర్లను బైండోవర్ చేశామని చెప్పారు. ఈ సమావేశంలో మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్ రావు, ఏసీపీ శ్రీనివాస్ రావు, ట్రాఫిక్ ఏసీపీ ఉమా మహేశ్వర్, సీఐ రాజశేఖర్, ఎస్ఐ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు' పయనమెటో..?

సాధారణ వ్యక్తి తన సేవలతో శక్తిగా మారాడు. ఓ వైపు సేవా కార్యక్రమాలను చేపడుతూనే బీజేపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేశాడు. కానీ కమలం కాదంది. దీంతో ఆయన సందిగ్ధంలో పడిపోయారు. ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా 'పాలమూరు' పయనంపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చలు సాగుతున్నాయి.

- విష్ణువర్ధన్‌రెడ్డిని పక్కన పెట్టిన కమలం
- అందె బాబయ్యకే అధిష్టానం దీవెనలు





విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: నియోజకవర్గంలో ఏళ్ల నుంచి పాలమూరు చారిటబుల్ ట్రస్టు పేరిట విష్ణువర్ధన్‌రెడ్డి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కోవిడ్ సమయంలో ఆయన చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేశాయి. ఉచిత మందుల పంపిణీ, వేసవిలో అంబలి కేంద్రాల ఏర్పాటు, యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లు, హెల్మెట్‌ల పంపిణీ, నిరుద్యోగులకు ఉపాధి కల్పన తదితర కార్యక్రమాలు చేపట్టి తన కంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు.

ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్

షాద్‌నగర్ నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ కోసం పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, ఏపీ మిథున్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేశారు. అయితే చివరికి పార్టీ అధిష్టానం ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన అందె బాబయ్య వైపు మొగ్గు చూపింది. బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ప్రధాన అనుచరుడిగా పేరొందిన బాబయ్యకు సైతం నియోజకవర్గంలో మంచి పట్టు ఉంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉండటంతో పాటుగా ఈటలతో ఉన్న సత్సంబంధాలు ఆయనకు లైన్ క్లియర్ చేసినట్లు చర్చింకుంటున్నారు.

అనుచరుల్లో అసంతృప్తి

పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డికి కమలం టికెట్ నిరాకరించడంతో ఆయన అనుచరులు అసంతృప్తిలో ఉన్నారు. టికెట్ ఆయనకే వస్తుందనే ధీమాతో ప్రచార రథాలు తయారు చేయించి గ్రామాల్లో సమావేశాలు, ర్యాలీలు చేపట్టారు. వివిధ పార్టీల నుంచి నేతలను, యువతను కమలం గూటికి తీసుకు వచ్చారు. టికెట్ రాకపోవడంతో అనుచరులు అయోమయం చెందుతున్నారు.

బరిలో నిలుస్తారా.?

ఎన్నికలే టార్గెట్‌గా పనిచేసుకున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి నిర్ణయంపై నియోజకవర్గమంతా చర్చించుకుంటోంది. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏవిధంగా ఉంటుందనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. ఆయన బాబయ్యకు మద్దతిస్తారా..? ఇండిపెండెంట్‌గా బరిలో నిలువనున్నారా అనే అంశంపై చర్చ సాగుతోంది. విష్ణువర్ధన్‌రెడ్డి రెండు రోజుల్లలో తన అనుచరులతో భేటీ తర్వాత కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పంచాయతీ టు అసెంబ్లీ

ఉమ్మడి రాష్ట్రానికి ముగ్గురు ఎమ్మెల్యేలను ఇచ్చిన పెద్దమంగళారం



మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారం రాజకీయ కీర్తిని ఘడించింది. ఉమ్మడి రాష్ట్రానికి ముగ్గురు ఎమ్మెల్యేలను అందించి రాజకీయ చరిత్రకెక్కింది. 1952, 1957లో షాబాద్ ఎమ్మెల్యేగా, 1959లో రెవెన్యూ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన కొండా వెంకట రంగారెడ్డి పెద్దమంగళారం వాసి. 1978–82 మధ్యకాలంలో చేవెళ్ల ఎమ్మెల్యేగా ఉన్న చిరాగ్ ప్రతాప్‌లింగం గౌడ్, 1983–85 మధ్యకాలంలో చేవెళ్ల ఎమ్మెల్యే పదవిలో ఉన్న కొండా లక్ష్మారెడ్డి పెద్దమంగళారం పంచాయతీకి చెందినవారే.

నిస్వార్థ జీవితం



చిరాగ్ ప్రతాప్‌లింగంగౌడ్

1952లో సోషలిస్టు పార్టీ నుంచి కేవీ రంగారెడ్డిపై పోటీ చేసి ఓటమి పాలైన చిరాగ్ ప్రతాప్‌లింగంగౌడ్ సైతం పెద్దమంగళవారం వాసియే. ఆయన 1978లో జనతా పార్టీ నుంచి చేవెళ్ల ఎమ్మెల్యేగా అసెంబ్లీ మెట్లెక్కారు. ఆది నుంచే ప్రజాసేవకు అంకితమైన ఆయన మొయినాబాద్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటుకు కృషి చేశారు. నిస్వార్థ జీవితం గడిపిన ఆయన ఎమ్మెల్యే పదవిలో ఉండగానే 1982 నవంబర్ 2న అనారోగ్యంతో మరణించారు. ఆయన మరణానంతరం భార్య, పిల్లలు గ్రామం వదిలి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారి కుటుంబానికి గ్రామంలో ఆస్తులేమీ లేవు.

ఉప ఎన్నికలో కొండా లక్ష్మారెడ్డి



చేవెళ్ల ఎమ్మెల్యేగా ఉన్న చిరాగ్ ప్రతాప్ లింగంగౌడ్ 1982 నవంబర్‌లో అనారోగ్యంతో మరణించడంతో 1983లో జరిగిన ఉప ఎన్నికల్లో కొండా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత మూడు పర్యాయాలు హైదరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మూడుసార్లు పోటీ చేసి ఓటమిచెందారు. ఈయన కొండా వెంకట రంగారెడ్డికి మనువడు. మరో మనువడు కొండా విశ్వేశ్వరరెడ్డి 2014లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి చేవెళ్ల పార్లమెంటు సభ్యుడిగా విజయం సాధించారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

విలీనానికి వ్యతిరేకం కేవీఆర్



కేవీ రంగారెడ్డి

1890 డిసెంబర్ 12న పెద్దమంగళారంలో రైతు కుటుంబంలో జన్మించిన కొండా వెంకట రంగారెడ్డి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. జమీందార్లకు, జాగీర్దార్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన ఆయన రైతుల పక్షాన పోరాటం చేశారు. ఆ సమయంలో జైలు జీవితం సైతం అనుభవించారు. 1952–57 వరకు షాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. 1956లో హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రాలో విలీనం చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పెద్దమనుషుల ఒప్పందంలో ఆయన కీలక భూమిక పోషించారు. 1959లో నీలం సంజీవరెడ్డి ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రిగా పనిచేసిన ఆయన అనంతరం ఉపముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. 1969లో తెలంగాణ ఉద్యమాన్ని లేవనెత్తి ప్రత్యేక రాష్ట్రంకోసం పోరాటం చేశారు. 1970 జూలై 24న ఆయన తుదిశ్వాస విడిచారు.

'సూదిని' ఓనమాలు ఇక్కడే..

కల్వకుర్తికి నాలుగుసార్లు ప్రాతినిథ్యం వహించిన జైపాల్‌రెడ్డి



దివంగత కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత సూదిని జైపాల్ రెడ్డి కల్వకుర్తి నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఆయన ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా పదవులను అలంకరించారు. ఆయన 1969 ఫిబ్రవరి 10న కల్వకుర్తి ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి అసెంబ్లీ మెట్లుఎక్కారు. రెండోసారి 1972లో బరిలో నిలిచిన ఆయన 9811 మెజార్టీతో విజయం సాధించారు. ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించడంతో సూదిని కాంగ్రెస్‌ను వీడి జనతా పార్టీలో చేరారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కమలకాంతా రావుపై 13,380 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1983లోనూ మరో సారి జనతాపార్టీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి బట్టు రుక్మారెడ్డిపై 17,461 ఓట్లతో గెలుపొందారు. వరుసగా గెలుపొందిన జైపాల్ రెడ్డి 1969 నుంచి 1985 వరకు అసెంబ్లీలో తన వాణి వినిపించారు. – ఆమనగల్లు

కాకా.. మన గుర్తు 'హస్తం'



కాకా యాదికున్నది కదా మన గుర్తు హస్తం. మా నాయనతో పని చేసినవ్.. ఇప్పుడు నాతో పని చేయాలి. మాతో రావాలి కాకా అంటూ ఓ ఓటరును ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డి ఆప్యాయంగా పలకరించారు. మన గుర్తు హస్తం అంటూ చెయ్యి చూపించారు. మీ నాయన వెంబటి నడిచాను బిడ్డా.. నీతో కూడా నడుస్తా అంటూ ఆయన బదులిచ్చారు. ఈ ఆసక్తికర సన్నివేశం గురువారం అమీర్‌పేట్ మార్కెట్ బస్తీలో చోటుచేసుకుంది. – బంజారాహిల్స్

పద్మారావు గెలుపు కోసం పాదరక్షలు త్యాగం

చిలకలగూడ : రాజకీయ నాయకుల గెలుపు కోసం కార్యకర్తలు పలు రకాల త్యాగాలు చేసి అమ అభిమానాన్ని చాటుకుంటారు. గుండు చేయించుకోవడం, ఒళ్లంతా టాటూలు, గుడి చుట్టు ప్రదక్షిణలు, గడ్డం పెంచుకోవడం, తాత్కాలికంగా మద్యం, మాంసం ముట్టకపోవడం వంటివి ఈ కోవలోకే వస్తాయి. సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుకు వీరాభిమాని. తమ నాయకుడి విజయం కోసం పాదరక్షలను త్యాగం చేస్తున్నట్లు ఇటీవల శపథం చేశాడు. అప్పటి నుంచి చెప్పులు వేసుకోకుండా ప్రచారంలో పాల్గొంటున్నాడు. మరోమారు పద్మారావు గెలిచి హ్యాట్రిక్ సాధించాలని, ఆయన విజయం సాధించిన తర్వాత విజయోత్సవ ర్యాలీలో పాదరక్షలు ధరిస్తానని పేర్కొన్నాడు.

ఉద్యమ'కారు'లో..

మండల పరిధిలోని కుమ్మరిగూడకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేశమల్ల ఆంజనేయులు, శేరి పెంటారెడ్డి తిరిగి గులాబీ గూటికి చేరారు. ప్రగతి భవన్‌లో గురువారం ఎంపీ రంజిత్‌రెడ్డి, క్యామ మల్లేశ్ సమక్షంలో సీఎం కేసీఆర్ వారికి కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. – షాబాద్



సీఎం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన దేశమల్ల ఆంజనేయులు

కాంగ్రెస్‌లో సహాయ నిరాకరణ!

- ప్రచారానికి కలిసిరాని అసమ్మతి నేతలు
- పార్టీని వీడుతున్న నాయకులు
- గాంధీ భవన్‌ను వదలని నిరసన జ్వాలలు

సాక్షి,సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీ అధికారమే లక్ష్యంగా ఆచితూచి ఎన్నికల బరిలో దింపుతున్న అభ్యర్థులకు 'స్థానిక'ంగా సహాయ నిరాకణ ఎదురు కావడం ఆందోళన కలిగిస్తోంది. పార్టీ టికెట్ ఆశించి భంగపడిన నేతల అసంతృప్తి చల్లారడం లేదు. ఇప్పటికే పలు నియోజకవర్గాలకు చెందిన అసమ్మతి వాదులు ఏకంగా అగ్రనేతలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తూ ఇతర పార్టీల్లో చేరిపోగా, మరికొందరు పార్టీ వదలకుండా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతూ అభ్యర్థుల ప్రచారానికి దూరం పాటిస్తున్నారు. పార్టీ పరంగా అధికారికంగా ఖరారైన అభ్యర్థులు సైతం అసమ్మతి నేతలను పట్టించుకోకపోవడంతో మరింత అగాధం పెరిగిపోతోంది. మరికొందరు అస్మతి నేతలు తమ అనుచరులను గాంధీభవన్‌కు పంపించి ఆందోళనకు దిగుతున్నారు. తాజాగా గురువారం నగర శివారులోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడిన దండెం రాంరెడ్డి అనుచరులు గాంధీభవన్‌లో ఆందోళనకు దిగారు. కార్యాలయంలో చొచ్చుకెళ్లి కుర్చీలు ధ్వంసం చేశారు.

సైలెంట్‌గా..

పలు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టికెట్ దక్కని నేతలు స్తబ్దంగా మారిపోయారు. మహేశ్వరంలో బండంగ్‌పేట మేయర్ పారిజాత తిరుగుబాటు బావుటా ఎగరవేసేందుకు సిద్ధమవుతుండగా రంగారెడ్డి డీసీసీ చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డిలు, అంబర్‌పేట లో లక్ష్మణ్ యాదవ్, నూతి శ్రీకాంత్ గౌడ్‌లు, ఎల్బీనగర్‌లో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రాజేంద్రనగర్‌లో జ్ఞానేశ్వర్ ముదిరాజ్, వేణుగోపాల్, గౌరి సతీష్‌లు, కూకట్‌పల్లిలో గొట్టి ముక్కల పద్మారావు, సత్యం శ్రీరంగం, నాగిరెడ్డి, గాలి బాలాజీ, శేరిలింగంపల్లిలో జైపాల్ యాదవ్‌తో పాటు రఘునాథ్ యాదవ్, కంటోన్మెంట్‌లో సర్వే సత్యనారాయణ, శ్రీగణేశ్, ఖైరతాబాద్‌లో ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, సనత్‌నగర్‌లో రవీందర్‌రెడ్డి, మర్రి ఆదిత్యరెడ్డి సహాయ నిరాకరణకు దిగారు.

పార్టీ నుంచి జంప్

ఎల్బీనగర్ నుంచి టికెట్ ఆశించిన ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ పార్టీకి రాజీనామా చేసి తిరిగి భార్య, కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నతో కలిసి గులాబీ గూటికి చేరుకున్నారు. జూబ్లీహిల్స్‌లో దివంగత పీజేఆర్ కుమారుడు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధరెడ్డి, కూకట్‌పల్లిలో గొట్టిముక్కల వెంగళరావులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

సీఎంను అందించిన సనత్‌నగర్ గడ్డ



సనత్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిని అందించిన కీర్తిని భాగ్యనగరం మూటగట్టుకుంది. రాజకీయ ఉద్దండుడు మర్రి చెన్నారెడ్డి 1989లో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. సనత్‌నగర్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆయన 1989 డిసెంబర్ 3 నుంచి 1990 డిసెంబర్ 17 వరకు సీఎం బాధ్యతలు చేపట్టారు. నగరం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ముఖ్యమంత్రిగా ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చి తనదైన మార్క్‌ను సాధించారు. సనత్‌నగర్ నుంచి పోటీ చేయక ముందే 1978 మార్చి 6 నుంచి 1980 అక్టోబర్ 11 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొదటిసారి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న సనత్‌నగర్ నియోజకవర్గం 1978లో ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడగా నాలుగో ఎమ్మెల్యేగా మర్రి చెన్నారెడ్డి ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇదే నియోజకవర్గం నుంచి ఆయన తనయుడు మర్రి శశిధర్‌రెడ్డిని నిలబెట్టి 1992లో గెలిపించుకుని తన రాజకీయ వారసత్వాన్ని అందించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై తన తండ్రి ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకుసాగారు. దశాబ్ద కాలం క్రితం వరకు సనత్‌నగర్ అంటే మర్రి కుటుంబం, మర్రి అంటే సనత్‌నగర్‌గా ఉంటూ వచ్చింది.

దోస్త్ VS దోస్త్





ఇద్దరు పాత మిత్రులు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీపడుతున్నారు. టీడీపీలో ఇరువురు సుదీర్ఘకాలం పని చేశారు. గ్రేటర్‌లో పలు పదవులు చేపట్టారు. టీడీపీ పనిచేసిన వీరిరువురు ఇప్పుడు ఒకరు బీఆర్ఎస్, మరొకరు బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారు. వారే ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, లంకల దీపక్ రెడ్డి. టీడీపీలో మూడు దశాబ్దాలకు పైగా గ్రేటర్‌లో పనిచేసిన మాగంటి గోపీనాథ్ 2014లో టీడీపీ తరఫున గెలిచి తర్వాత బీఆర్ఎస్‌లో చేరి 2018లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. రెండు దశాబ్దాలుగా టీడీపీలో గ్రేటర్‌తో పాటు రాష్ట్ర పదవులు చేపట్టిన లంకల దీపక్‌రెడ్డి తర్వాత పరిణామాలతో బీజేపీలో చేరారు. రాజకీయ అనుభవం కలిగిన లంకలకు బీజేపీ పార్టీ టికెట్‌ను ఖరారు చేసింది. ఇద్దరూ టీడీపీలో కలిసి గ్రేటర్‌లో పనిచేశారు. ఇద్దరు పాత మిత్రులు ప్రస్తుతం పోటీలో ఉన్నారు. కొత్తగా ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న లంకల తన అనుభవాన్ని జోడించి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తారా.. లేదంటే మాగంటి హ్యాట్రిక్ కొడతారా? అనేది ఓటర్లే నిర్ణయిస్తారు. – శ్రీనగర్‌కాలనీ

తిరస్కరణకు గురైతే డిపాజిట్ వాపసు ఇస్తారా?

మీకు తెలుసా?

నామినేషన్లను దాఖలు చేసిన అభ్యర్థి తమ నామ పత్రాలు స్క్రూట్నీలో తిరస్కరణకు గురైతే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి చెల్లించిన డిపాజిట్ (ధరావతు)ను తిరిగి అభ్యర్థికి చెల్లిస్తారు. ఈ సెక్యూరిటీ డిపాజిట్‌ను వెంటనే చెల్లించరు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక ఇస్తారు. తిరస్కరణకు గురైన అభ్యర్థి ఎన్నికలు ముగిశాక రిటర్నింగ్ అధికారికి తాను చెల్లించిన ధరావతును తిరిగి చెల్లించాలని కోరుతూ ఒక వినతి పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. వివరాలను సరి చూసుకుని అభ్యర్థి ధరావతును వాపస్ ఇచ్చేస్తారు. నామినేషన్లను బరిలో ఉండకుండా అభ్యర్థి తన నామ పత్రాలను ఉప సంహరించుకుంటే, నగదు రూపంలో రిటర్నింగ్ అధికారికి సెక్యూరిటీ డిపాజిట్‌ను చెల్లించినట్లయితే వెంటనే చెల్లిస్తారు. – నాంపల్లి

ఇంటి నుంచే ఓటేయొచ్చు



సాక్షి, మేడ్చల్ జిల్లా: వయోధికులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోచ్చని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోనుందని పేర్కొన్నారు. జిల్లాలో వయోధిక ఓటర్లు 32,921 మంది, దివ్యాంగ ఓటర్లు 24,751 మంది ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే 80 ఏళ్లకు పైబడిన వయోవృద్ధులు, 40 శాతం కన్నా మించి ఉన్న దివ్యాంగులు ఫారం–12 (డీ)లో తమ పూర్తి వివరాలను నమోదు చేసి ఈ నెల 7 వరకు బూత్ స్థాయి అధికారులకు (బీఎల్వోలకు) అందించాలని గౌతమ్ సూచించారు. ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వారి వద్దకు రెండు రోజుల ముందే పోలింగ్ అధికారులు వస్తారని తెలిపారు. వీరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు కంపార్టుమెంట్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. సదరు ఓటర్లు రహస్యంగా ఓటు హక్కు వినియోగించుకుని బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియను అంతా వీడియో కవరేజీ చేస్తారని తెలిపారు. ఒకవేళ మొదటి రోజు ఓటు హక్కు వినియోగించుకోని పక్షంలో మరో రోజు ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పిస్తారని, ఇలా రెండుసార్లు మాత్రమే వీలు కల్పిస్తామని చెప్పారు.